క్లుప్తంగా

కిడ్నాప్ చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత


వర్ధినీడి సుజాత

పిఠాపురం: కరపలో మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. రాజస్థాన్ నుంచి వచ్చిన కుటుంబానికి చెందిన బాలికను కిడ్నాప్ చేస్తే పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా పోలీసులు కిడ్నాప్ చేసిన వ్యక్తి పట్టుకుని, బాలికను రక్షించి వారి కుటుంబానికి అప్పగించాలని ఆమె కోరారు.

ఒలింపిక్ డే రన్


కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాల వద్ద నిర్వహిస్తున్న ఒలింపిక్ డే రన్

కొత్తపల్లి: అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా మండలంలోని ఉప్పాడలో మంగళవారం జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-2 పైడిరాజు, కొత్తపల్లి జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌లు సీకోటి బుజ్జీ, వనమాడి తాతాబ్బాయి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్నపూర్ణ, శాస్త్రి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతతో చేయాలి


నవరలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతతో తయారు చేస్తే నూరు శాతం విద్యార్థులు భోజనం చేయడానికి అవకాశం ఉంటుందని ఎంఈఓ-2 పి.పుల్లయ్య అన్నారు. నవర జిల్లా పరిషత్తు హైస్కూల్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో 178 మంది విద్యార్థులు ఉండగా, 142 మంది మధ్యాహ్న భోజనం చేసినట్లు గుర్తించారు. మిగిలిన వారు కూడా మధ్యాహ్న భోజనం చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన మెను ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అది ప్రభుత్వ స్థలమే..

తహసీల్దార్ చిన్నారావు


ప్రకాశ్ నగర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

కొత్తపల్లి: ప్రకాశ్ నగర్‌లో ఉన్న స్థలం ఏ వర్గానికి చెందినది కాదని, అది ప్రభుత్వ స్థలమని తహసీల్దార్ చిన్నారావు స్పష్టం చేశారు. మండలంలోని మూలపేటలోని ప్రకాశ్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంపై కొన్ని రోజులుగా రజకులు, పట్టుశాలీ వర్గాల మధ్య వివాదం నెలకొంది. దీనిపై ఆయా వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆ స్థలాన్ని తహసీల్దార్ పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకాశ నగర్‌లో ఉన్న 25 సెంట్లు గతంలో సామాజిక స్థలంగా కేటాయించినట్టు చెప్పారు. ఈ స్థలం ఏ కులానికి కేటాయించలేదన్నారు. ఈ స్థలంలో ఏ కులానికి చెందిన వారు వెళ్లరాదని స్పష్టం చేశారు. పంచాయతీ నిర్ణయం మేరకు ఈ స్థలం ఉంటుందన్నారు.

యువతి అదృశ్యం

కరప: ఉప్పలంక గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, ఉప్పలంక గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతికి వివాహం కుదిరింది. వచ్చే నెలలో నిశ్చితార్థానికి పెద్దలు నిర్ణయించారు. ఈ వివాహం ఇష్టం లేకపోవడంతో ఆమె సోమవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఆమె గురించి ఉప్పలంక, పరిసర గ్రామాల్లోను, బంధువులు, స్నేహితుల గృహాల్లో గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో మంగళవారం రాత్రి కరప పోలీసుస్టేషన్‌లో ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు. ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బొప్పాయి.. అన్నింటా గొప్పోయి..

- మెట్టలో ఆశాజనకంగా బొప్పాయి సాగు
- మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి
- అన్ని సీజన్లలోనూ రైతులకు లాభాలు
- ఆరోగ్య ప్రయోజనాలెన్నో..


చిన బ్రహ్మదేవంలో బొప్పాయి తోట


భారీగా కాసిన బొప్పాయి కాయలు

పెద్దాపురం: ప్రస్తుత సీజన్‌లో ఆరోగ్యప్రదమైన ఫలంలో బొప్పాయి ఒకటి. రాష్ట్రవ్యాప్తంగా అనంతపురం, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాలతో పాటు కోస్తాలో అధికంగా బొప్పాయి సాగవుతోంది. మెట్ట ప్రాంతంలోనూ బొప్పాయి సాగు రైతులకు మంచి ఆదాయాన్ని సమకూరుస్తోంది. ప్రధానంగా మెట్ట కేంద్రమైన పెద్దాపురం మండలంలోని చినబ్రహ్మదేవం, జె.తిమ్మాపురం, కట్టమూరు, ఆర్‌బీ పట్నం, కొత్తూరు, కొండపల్లి, ఆనూరు తదితర గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో బొప్పాయి పంట సాగవుతోంది. నారు దశ మొదలు ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్య పద్ధతులు, కోత, దిగుబడి వంటి అంశాలపై ఉద్యాన శాఖాధికారులు, శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు రైతాంగాన్ని అప్రమత్తం చేయడంతో, బొప్పాయి సాగు మెట్ట రైతాంగానికి లాభాలు చేకూరుస్తుందనడంలో సందేహం లేదు.

ఎరువుల యాజమాన్యం

చెట్టు వయస్సును బట్టి ఎరువులను వినియోగించాలి. ఏకలింగాశ్రయ దీర్ఘకాలిక రకాల బొప్పాయి ఒక మొక్కకు పది కిలోల పశువుల ఎరువు, 12 కిలోల వేప లేదా ఆముదపు పిండి, 500 గ్రాముల యూరియా, 1.6 కిలోల సింగిల్ సూపర్‌ఫాస్పేట్, 800 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువలను వేయాలి. రెండు నెలలకోసారి, ఏడాదిలో ఆరు సార్లు ఎరువులను వేయాలి. సూక్ష్మధాతు లోప నివారణకు ఐదు గ్రాముల జింక్ సల్ఫేట్, ఒక గ్రాము బోరాక్స్ లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలి. డ్రిప్ ద్వారా ఎరువులను అందించే పక్షంలో 13.5 గ్రాముల యూరియా, 19.5 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాషియం, వారం రోజుల వ్యవధితో 48 వారాలు ఇవ్వాలి. ఏక వార్షిక రకాలకు ఎరువులను ఏడో నెల వరకు అందించాలి.

ఫెర్టిగేషన్

సిఫారసు చేయబడిన ఎరువులను కరగబెట్టి వడగట్టిన తరువాత ఫెర్టిగేషన్ ట్యాంక్ లేదా ఫుట్ స్ప్రేయర్ ద్వారా డ్రిప్ మెయిన్ పైపులోకి ప్రవేశపెట్టాలి. భాస్వరపు ఎరువుని ఫాస్ఫేట్ రూపంలో ప్రతి రెండు నెలలకోసారి 260 గ్రాములు చెట్టుపాదులో కలపాలి.

నీటి యాజమాన్యం

మొక్క మొదళ్ల వద్ద నీరు తగలకుండా, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పిల్ల పాదులు (డబుల్ రింగ్ పద్ధతి) తయారు చేసి నీరు పారించాలి. డ్రిప్ పద్ధతిలో నీరు పెట్టినా అధిక దిగుబడులు సాధించవచ్చు. డ్రిప్ ద్వారా చిన్న మొక్కలైతే రెండు రోజులకోసారి 8 లీటర్ల నీటిని, పెద్ద మొక్కలకు వేసవిలో ప్రతి 20-25 లీటర్ల నీటిని అందేలా డ్రిప్పర్లు అమర్చాలి. వర్షాకాలంలో అవసరాన్ని బట్టి నీరు అందించాలి.

కోత, దిగుబడి

మంచి సైజు వచ్చిన కాయలను చెట్టుపై మాగనీయకూడదు. వాటిని కోసి పేపర్‌తో చుట్టి రవాణా చేయాలి. నాటిన 9వ నెల నుంచి రెండున్నరేళ్ల వరకు పంట వస్తుంది. ద్విలింగపుష్పాల నుంచి ఎదిగే కాయలు తక్కువ పొడవుతో గుండ్రంగా ఉంటాయి. అదే ఆడపుష్పాల నుంచి ఎదిగే కాయలు పొడవుగా, కోలగా ఉంటాయి. దిగుబడి ఎకరాకు 35 నుంచి 40 టన్నుల వరకు ఉంటుంది.

బొప్పాయితో మంచి ఆదాయం



మెట్ట ప్రాంతం కావడంతో ఎక్కువ అపరాలు, పండ్ల తోటలను పండిస్తుంటాం. ప్రధానంగా మామిడి, జీడిమామిడితో పాటు బొప్పాయి సాగులోను మంచి ఆదాయం వస్తుంది. అధికారుల సూచనలతో మరింత జాగ్రత్తగా సాగు చేపట్టడంతో బొప్పాయి సాగు దిగుబడి ఆశాజనకంగా వచ్చింది.

– ఆచంట శివ, బొప్పాయి సాగు రైతు, చిన బ్రహ్మదేవం, పెద్దాపురం మండలం

ఆరోగ్యానికి చాలా మంచిది



బొప్పాయి పండు ఆరోగ్యానికి చాలా మంచింది. బొప్పాయిలో విటమిన్ సి, ఏ, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. జీర్ణక్రియను మెరుగుపర్చడానికి సహాయపడుతుంది. రోగ నిరోధక శక్తి పెంచడంతో పాటు, కొన్ని వ్యాధుల నుంచి రక్షిస్తుంది.

– డాక్టర్ భ్రమరాంబ, ఏరియా ఆసుపత్రి వైద్యులు, పెద్దాపురం

అంగరంగ వైభవంగా మరిడమ్మ జాతర ఆరంభం


ప్రత్యేకాలంకరణలో మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా ఉభయ రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆషాఢ మాసంలో 37 రోజుల పాటు నిర్వహించే అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా గరగల నృత్యం, అమ్మవారి రథం, బ్యాండ్ మేళాలు, కోలాటం మధ్య అమ్మవారి సంబరం అంబరాన్నంటింది. జాతర మహోత్సవాన్ని రాత్రి 8 గంటలకు దేవదాయ శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ ప్రారంభించారు. వారికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, ఆలయ ట్రస్టీ చింతపల్లి శ్రీహర్ష, వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ఘన స్వాగతం పలికారు. దేవదాయ శాఖాధికారులు అమ్మవారిని దర్శించుకుని కొబ్బరికాయ కొట్టి జాతరను ప్రారంభించారు. ఉత్సవంలో భాగంగా అమ్మవారి గరగల నృత్యం, కోలాటం, పులి ఆట, సంబరాల్లోని పలు సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు తిలకించారు. తొలుత పాత పెద్దాపురం (కోట ముందు) పురాతన చరిత్ర కలిగి మరిడమ్మ అమ్మవారు వేలసిన ఆలయంలో గరగను ఎత్తుకుని సంబరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సర్కారీ స్కూళ్ల విద్యార్థుల సత్తా

ట్రిపుల్ ఐటీ సీట్లలో బాలికలదే పైచేయి


వైఎస్ వెంకట సుధ, స్వామిరెడ్డి రమ్య భవాని, అడబాల గీతావరలక్ష్మి, తాడిచెర్ల రాజు, చిట్టూరి సత్యనవ్యశ్రీ, ఎం.దీప్తి, అంజాలపు సత్యరేవతి, టి.తరుణ్ మణికంఠ, ఇనుమర్తి హరివీరభద్రం, కాజులూరి నిహారిక, గుబ్బల పవనశ్రీ

పిఠాపురం: నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించడంలో సత్తా చాటారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్కువ సీట్లు సాధించారు. వీరిలో బాలికలే పైచేయిగా ఉన్నారు.

గొల్లప్రోలు మండలంలో..

మండలంలో ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 12 మంది విద్యార్థులు ట్రిపుల్ టీ సీట్లు సాధించారు. గొల్లప్రోలు బాలికల జెడ్పీ హైస్కూలుకు చెందిన తోట పుష్పాంజలి-నూజివీడు, ఆకేటి కనకవల్లి-నూజివీడు, ముప్పిడిశెట్టి సుమశ్రీ-శ్రీకాకుళం, గొల్లప్రోలు బాలుర జెడ్పీ హైస్కూలుకు చెందిన ఎస్‌డీఎస్‌వీ చక్రధర్-నూజివీడు, తాటిపర్తి జెడ్పీ హైస్కూలుకు చెందిన కోన కృష్ణార్జున-ఇడుపులపాయ, దాసం నాగేశ్వర అపర్ణ-శ్రీకాకుళం, దుర్గాడ జెడ్పీ హైస్కూలుకు చెందిన కోసిరెడ్డి బేబీ-శ్రీకాకుళం, జీలకర్ర జ్యోతి-ఒంగోలు, గొల్లకోటి లీల-శ్రీకాకుళం, చేబ్రోలు జెడ్పీ హైస్కూలుకు చెందిన డి.సుమ-నూజివీడు, వి.అజయ్ రాజు-ఆర్‌కే వ్యాలీ, వి.చంద్ర మాణిక్యం-ఆర్‌కే వ్యాలీల్లో సీట్లు సాధించారు.

పిఠాపురంలో..

పట్టణంలోని బాదం మాధవరావు బాలికల జెడ్పీ హైస్కూలుకు చెందిన మురుకుర్తి శ్రీకీర్తన-నూజివీడు, గాలంకి శ్రీసాహిత్య-ఒంగోలు, పగడాల పద్మశ్రీ, చోడవరపు వైష్ణవి, రామవరపు హారిక శ్రీకాకుళంలో సీట్లు సాధించారు.

కొత్తపల్లి: ట్రిపుల్ ఐటీకి మండలంలో బాలికలు ఎక్కువ సీట్లు సాధించినట్లు ఎంఈఓ వేణుగోపాల్ తెలిపారు. ఎండపల్లి జెడ్పీ పాఠశాలకు చెందిన వైఎస్ వెంకటసుధ, స్వామిరెడ్డి రమ్యభవాని, అడబాల గీతావరలక్ష్మి, తాడిచెర్ల రాజు, చిట్టూరి సత్యనవ్యశ్రీ, కొండెవరం జెడ్పీ పాఠశాలకు చెందిన ఎం.దీప్తి, కోనపాపపేట జెడ్పీ పాఠశాలకు చెందిన అంజాలపు సత్య రేవతి, రమణక్కపేటకు చెందిన టి.తరుణ్ మణికంఠ, వాకతిప్ప జెడ్పీ పాఠశాలకు ఇనుమర్తి హరివీరభద్రం, కొమరగిరి జెడ్పీ పాఠశాలకు చెందిన కాజులూరి గౌరీ నిహారిక, గుబ్బల పవనశ్రీ సీట్లు సాధించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వ్యాన్


ఎఫ్‌సీఐ రోడ్డులో విరిగిపోయిన విద్యుత్ స్తంభం

సామర్లకోట: అదుపు తప్పిన వ్యాన్ మంగళవారం స్థానిక ఎఫ్‌సీఐ రోడ్డులోని టైల్స్ షాపు వద్ద రోడ్డు మార్జిన్‌లో విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దాంతో మంటలు చెలరేగడంతో స్థానికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. వివిధ ప్రాంతాల నుంచి బియ్యం లోడ్‌ను ఎఫ్‌సీఐ గోదాములో దింపడానికి వచ్చిన లారీ డ్రైవర్ల సైతం పరుగులు పెట్టారు. స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సత్యనారాయణపురం, మాజేటి నగర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఎఫ్‌సీఐ గోదాములకు సుమారు ఐదు గంటల పాటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో రిజిస్ట్రార్ కార్యాలయంలో కక్షిదారులు ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌కుమార్ తమ సిబ్బందితో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయించి, సరఫరాను పునరుద్ధరించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే వ్యాన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొందని స్థానికులు తెలిపారు. వ్యాన్ డ్రైవర్‌పై ఫిర్యాదు చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

సంస్కృతికి భాషే ఆధారం

మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కమిషనర్, హెచ్‌ఎం

సామర్లకోట: భాష ఆధారంగానే సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. కొత్త భాష నేర్చుకుందాం అనే కార్యక్రమం ముగింపు సందర్భంగా మంగళవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ భాషల్లో ఉండే మాధుర్యం గ్రహిస్తే ఆయా ప్రాంతాల సంస్కృతిపై అవగాహన కలుగుతుందన్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా తమిళ భాషపై ఈ నెల 16 పాఠశాలలో శిక్షణ ప్రారంభించారు. తమిళ భాషలో శిక్షణ పొందిన విద్యార్థులను కమిషనర్ అభినందించారు. ఒకే భాష కాకుండా వివిధ భాషలు నేర్చుకోవడం ద్వారా ఉపాధి అవకాశం మెరుగ్గా ఉంటుందన్నారు. పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ మాట్లాడుతూ, తమిళ భాష విద్యార్థులకు నేర్పడానికి తమ పాఠశాలను ఎంపిక చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. నవోదయ స్కూల్ హిందీ టీచరు, రీసోర్స్‌పర్సన్ ఎం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, తమిళ భాషలో ఉండే సౌందర్యాన్ని, సౌలభ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా రీసోర్స్‌పర్సన్‌ను కమిషనర్ శ్రీవిద్య సత్కరించారు. తమిళ భాష నేర్చుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీ పి.సుధారాణి, ఉపాధ్యాయులు ఎస్ హరినాథ్, బాల శైలజ, టి.పద్మావతి, లక్ష్మీదుర్గా, బేబీరాణి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ నం.5ను సవరించాలని ధర్నా


సామర్లకోట ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సచివాలయ సిబ్బంది


గొల్లప్రోలులో వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు


కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

సామర్లకోట: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు 5ను సవరించాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని సచివాలయాల కార్యదర్శులు మంగళవారం ధర్నా నిర్వహించారు. వార్డు సచివాలయ ఉద్యోగులకు సొంత మండలంలో పని చేసుకునే అవకాశం కల్పించేలా జీఓ నెంరు 6 విడుదల చేశారని, వారి మాదిరిగానే గ్రామ సచివాలయ ఉద్యోగులకు కూడా సొంత మండలంలో పని చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లు లేకుండా బదిలీలా, పని కోసం మా వాళ్లు, ప్రమోషన్ అడిగితే పరాయివాళ్లా అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియలో మిగులు సిబ్బందిని ఏం చేస్తారో తెలియజేయాలని సచివాలయ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోవరాజు ప్రశ్నించారు. ప్రమోషన్లు ఇచ్చి బదిలీలు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, సచివాలయ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం వారి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరికి సమర్పించారు.

ట్రాన్స్‌ఫర్లు కాదు.. ప్రమోషన్లు ఇవ్వండి

పిఠాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు మంగళవారం పిఠాపురం, గొల్లప్రోలులో ఆందోళన నిర్వహించారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను ఆయా ఎంపీడీఓలకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 5ను సవరించాలన్నారు. ఇటీవల విడుదల చేసిన వార్డు సచివాలయ ఉద్యోగులకు సొంత మండలంలో పని చేసుకునే అవకాశం చేసుకునేలా జీఓ నంబరు 6 విడుదల చేశారని, వారి మాదిరిగానే గ్రామ సచివాలయ ఉద్యోగులకు కూడా సొంత మండలాల్లో పనిచేసుకునే అవకాశం కల్పించాలని వారు కోరారు. ప్రభుత్వం చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియలో మిగులు సిబ్బందిని ఏం చేస్తారో తెలియచేయాలని, ట్రాన్స్‌ఫర్లు కాదు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ఇతర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

కొత్తపల్లి: గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీలను సీనియారిటీ, మెరిట్ జాబితాను విడుదల చేసి సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని, ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా చూడాలని మండల సచివాలయ ఉద్యోగులు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ రవికుమార్, డిప్యూటీ ఎంపీడీఓ హరిసత్యాకృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగులకు సొంత మండలాలలో అవకాశాలు కల్పించాలని, రేషనలైజేషన్ ప్రక్రియ ద్వారా ఏర్పడిన ఉద్యోగులకు ప్రభుత్వం ఏవిధంగా వినియోగించుకుంటుందో స్పష్టత ఇవ్వాలన్నారు. పదోన్నతులు కల్పించాలని, స్పష్టమైన జాబ్ చార్ట్ ఇచ్చి, సర్వీసు నిబంధలను అమలు చేశాకే బదిలీల ప్రక్రియ నిర్వహించాలన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఇంక్రిమెంట్ల కోసం కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.

భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోండి

కాకినాడ సిటీ: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూయజమానులు సమస్యల పరిష్కారానికి ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా కోరారు. భూముల విభజనకు ప్రభుత్వ నిర్దేశిత రుసుము రూ.500 నుంచి రూ.50కి తగ్గిందన్నారు. జాయింట్ హక్కుదారులుగా ఉన్న భూములపై వివాదాలు, రిజిస్ట్రేషన్ సమస్యలు, ప్రభుత్వ పథకాల లబ్ధిలో అడ్డంకులు తలెత్తుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనుందన్నారు. జిల్లాలో 273 గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జేసీ తెలిపారు. గతేడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో జరిగిన గ్రామ సభల్లో వచ్చిన అర్జీల్లో కొన్ని ఎల్పీఎంల సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు, జాయింట్ ఎల్పీఎంల విభజనకు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని జేసీ సూచించారు.

డాక్టర్ సతీష్ సేవలు అభినందనీయం


డాక్టర్ సతీష్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

పెద్దాపురం: పట్టణంలోని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సతీష్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పెద్దాపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్ అనపర్తి బదిలీ కావడంతో, మంగళవారం ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సహచర వైద్యులు సూర్యకుమారి, జగదాంబ, ఉమామహేశ్వరి తదితరులు మాట్లాడుతూ, సిబ్బందిని సొంత కుటుంబంలా చూసుకుంటూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తూ, అందరి మన్ననలు పొందిన వ్యక్తి డాక్టర్ సతీష్ అని కొనియాడారు. అనంతరం ఆయనను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వైద్యులు ప్రశాంత్, శ్రీనివాస్, శ్రీవిద్య, సిద్ధ, ఐసీటీసీ కౌన్సిలర్ బి.శ్రీనివాసరావు, నరేంద్ర, కిషోర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ సదుపాయాలు మెరుగుపర్చాలి


సర్పంచ్‌లకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీలు

సామర్లకోట: ప్రతి గ్రామంలోను మార్కెట్ సదుపాయాలను సర్పంచ్‌లు మెరుగు పర్చాలని ఫ్యాకల్టీ చక్రపాణిరావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని సర్పంచ్‌లకు రెండో రోజు శిక్షణలో ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో రైతులు పండించిన పంటలను స్థానికంగా ఉండే వారికి అందే విధంగా మార్కెట్ సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రామంలోను మహిళా సంఘాలు ఉంటాయని, వారు తయారు చేసిన వస్తువులను మార్కెట్లలో విక్రయించే అవకాశం ఉంటుందన్నారు. నాణ్యత కలిగిన వస్తువులు స్థానికంగానే లభించడంతో మార్కెట్‌లకు డిమాండ్ ఉంటుందన్నారు. గ్రామాల్లో నాణ్యత కలిగిన వస్తువులు విక్రయించడంతో పట్టణ ప్రాంతాలకు చెందని వారు కూడా సమీప గ్రామాలకు వచ్చి వస్తువులు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. కోర్సు డైరెక్టర్ కె.సునీల మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాలలోను సమానత్వం కలిగి ఉండాలని సూచించారు. సర్పంచ్‌లుగా సొంత నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సర్పంచ్‌గా ఉత్తమ సేవలు అందిస్తే ప్రజల్లో గుర్తింపు ఉంటుందన్నారు. గ్రామాలకు వచ్చే నిధులపై అవగాహన కలిగి ఉండి, వాటిని ప్రజోపయోగ పనులకు వినియోగించాలన్నారు. ప్రిన్సిపాల్ కేఎస్‌పీ ప్రసాదరావు, వైస్ ప్రిన్సిపాల్ రమణ శిక్షణ తీరును పరిశీలించారు. ఫ్యాకల్టీలు కేఆర్ నిహారిక, జగన్నాథం శిక్షణ నిర్వహించారు.

మస్కట్ నుంచి తిరిగొచ్చిన మహిళ


బిక్కినకు కృతజ్ఞతలు తెలుపుతున్న లంక గౌరి

పెద్దాపురం: ఉపాధి కోసం మస్కట్ వెళ్లి, పనులు దొరక్క ఇబ్బందులు పడుతున్న మహిళ బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ఆర్థిక సాయంతో తిరిగి ఇండియాకు తిరిగొచ్చింది. కాకినాడ రూరల్ మండలం గురజాపల్లికి చెందిన లంక గౌరి కుటుంబ పోషణ కోసం మస్కట్ వెళ్లింది. ఆమెను తీసుకొని వెళ్లిన ఏజెంట్ మోసం చేశాడు. ఎటువంటి పనులు దొరక్క, తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్న విషయం బీజేపీ నేత బిక్కిన దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సహకారంతో, లంక గౌరి తిరుగు ప్రయాణానికి అవసరమైన రూ.2.50 లక్షలను ఖర్చు చేసి, బాధితురాలిని ఆయన ఇండియాకు తీసుకొచ్చారు. మస్కట్ నుంచి తిరిగొచ్చిన గౌరి మంగళవారం కట్టమూరులోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపింది. తాను మస్కట్‌లో చాలా ఇబ్బందులు పడ్డానని పేర్కొంది. నిర్ణీత గడువులోగా ఇండియా వెళ్లకపోతే అక్కడి పోలీసులు నిర్బంధిస్తామని చెప్పారన్నారు. దీంతో భయపడి తన కుటుంబ సభ్యులకు విషయం చెప్పినట్టు తెలిపారు.